అనధికార పార్కింగ్‌తో పరేషాన్

- రోజుల తరబడి రోడ్లపైనే వాహనాలు
- ఫోర్‌మెన్‌బంగ్లా రోడ్డులో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు



నైజాంగేటు సెంటర్ సమీపంలో రోజుల తరబడి రోడ్డుపైనే వదిలేసిన కార్లు

వించిపేట(విజయవాడపశ్చిమ): స్థానిక వించిపేటలోని పంజాసెంటర్ నుంచి ఫోర్‌మెన్ బంగ్లా వెళ్లే రహదారి రోజుల తరబడి అనధికారిక పార్కింగ్‌తో రోడ్డు కుంచించుకుపోతోంది. ఒక పక్క అనధికారికంగా కొంతమంది రోడ్లను ఆక్రమించుకుని దుకాణాలు ఏర్పాటు చేసుకుంటుంటే, మరోపక్క రోడ్డు మీదే రోజుల తరబడి కొంతమంది యజమానులు మరమ్మతులకు గురైన తమ వాహనాలను వదిలేస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. వించిపేట, నైజాంగేటు సెంటర్, ఫోర్‌మెన్ బంగ్లా ప్రాంతాల నుంచి నగరంలోకి ఎక్కడికి వెళ్లాలన్నా ఈ రహదారి మీదుగానే పంజాసెంటర్, అటు నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. దీంతో ప్రతిరోజు విద్యార్థులు, ఉద్యోగులు ద్విచక్ర వాహనాలు, ఇతర ప్రైవేటు వాహనాలతో ఈ రహదారి రద్దీగా ఉంటుంది.

తరచూ ట్రాఫిక్‌తో ఇబ్బందులు

ప్రతిరోజు వాహనాల రద్దీతో ఉండే ఈ రహదారిలో కొంతమంది మరమ్మతులకు గురైన కార్లు, ఆటోలు, ఇతర వాహనాలు ఏళ్ల తరబడి రోడ్డు మీదే వదిలివేయడంతో తరచూ ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ప్రతిరోజు వాటిని దాటుకుంటు వెళ్తున్న ట్రాఫిక్ పోలీసులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు వాటిపై దృష్టి పెట్టకపోవడం పట్ల స్థానికులు విమర్శిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

ప్రతిరోజు వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగించే పంజాసెంటర్ - ఫోర్‌మెన్‌బంగ్లా రహదారిలో రోడ్డును ఆక్రమించుకుని వాహనాలను నిలుపుతుండటంతో ట్రాఫిక్ అంతరాయంతో పాటుగా అక్కడ పారిశుద్ధ్య సమస్య కూడా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. దీన్ని అడ్డుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. దీంతో ఇక్కడ ఆక్రమణలతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారుల రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని స్థానికులు కోరుతున్నారు.

దామోదరం సంజీవయ్య సేవలు ఎనలేనివి

డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డీఎంహెచ్ఓ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య బడుగు, బలహీన వర్గాలకు అందించిన సేవలు ఎనలేనివని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. నగరంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో శుక్రవారం దామోదరం సంజీవయ్య జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసినితో పాటు, పలువురు ఉద్యోగులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రిగా సేవలందించిన సంజీవయ్య సాంకేతిక విద్యను అందుబాటులోకి తెచ్చారని చెప్పారు. చర్మకారులకు లిడ్‌క్యాప్ ఏర్పాటు చేయడంతో పాటు పారిశ్రామికాభివృద్ధి దిశగా అడుగులు వేశారన్నారు. అనేక విప్లవాత్మక మార్పులను శ్రీకారం చుట్టారని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ నవీన్, వైద్యులు కార్తీక్, బాలాజీ, డెప్యూటీ డెమో డాక్టర్ ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మ్యూజికల్ నైట్' ఏర్పాట్ల పరిశీలన



'మ్యూజికల్ నైట్' బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖర్‌బాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న సినీ సంగీత దర్శకుడు తమన్ 'మ్యూజికల్ నైట్' కార్యక్రమ బందోబస్తు ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం నగర పోలీస్‌కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్‌బాబు పరిశీలించారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇతర ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో స్టేడియం, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భద్రత, పటిష్ట బందోబస్తును క్షుణ్ణంగా పరిశీలించారు. ఎటువంటి లోపాలు లేకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని తగిన భద్రత చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్ పరంగా సామాన్య ప్రజలు ఎక్కడా ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీపీలు గౌతమి షాలి, డాక్టర్ తిరుమలేశ్వరరెడ్డి, కేఎం మహేశ్వరరాజు, కేజీవీ సరిత, కృష్ణమూర్తినాయుడు, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

మ్యాన్‌హోల్స్ క్లీనింగ్



భవానీపురం(విజయవాడపశ్చిమ): గట్టు వెనుక ప్రాంతంలోని 40వ డివిజన్ పరిధిలో గల భూగర్భ డ్రెయినేజికి సంబంధించిన మ్యాన్‌హోల్స్ క్లీనింగ్ చర్యలను శుక్రవారం నగరపాలకసంస్థ సిబ్బంది చేపట్టారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయ రెడ్డి గాంధీ బొమ్మ రోడ్, చర్చి రోడ్‌లలో ఉన్న యూజీడీ మ్యాన్‌హోల్స్ ఓపెన్ చేయించి జెట్ ఇంజిన్‌తో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూజీడీ మ్యాన్‌హోల్స్‌లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి మురుగు నీటి పారుదల సక్రమంగా జరగడం లేదన్నారు. దీంతో అవి నిండిపోయి మురుగు పొంగిపొర్లి రోడ్లపై ప్రవహిస్తోందని తెలిపారు. డివిజన్ ప్రజల ఫిర్యాదుల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గోపి, నగరపాలకసంస్థ యూజీడీ సిబ్బంది పాల్గొన్నారు.

పుల్వామా అమరవీరులకు నివాళి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పుల్వామా అమరవీరులకు యావత్ దేశ ప్రజలు నివాళులర్పిస్తున్నారని మాజీ కార్పొరేటర్ ఉత్తమచంద్ భండారీ అన్నారు. పుల్వామా అమరవీరులకు స్థానిక సామారంగంచౌక్‌లో మోదీ సేన ఆధ్వర్యాన కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ్‌చంద్ భండారీ మాట్లాడుతూ పాక్ పిరికి చర్య వల్ల పుల్వామా ఉగ్రదాడిలో పలువురు భారత జవానులు అమరులయ్యారన్నారు. వారి త్యాగాలను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని చెప్పారు. ఫిబ్రవరి 14వ తేదీని ప్రేమికుల దినోత్సవంగా కాకుండా పుల్వామా అమరవీరుల త్యాగాలకు గుర్తుగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పొట్టి శ్రీహరి, కే నాగేశ్వరరావు, దొడ్ల రాజ, లింగాల అనీల్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ద్వాదశ ప్రదక్షిణలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లో కొలువై ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి ద్వాదశ ప్రదక్షిణలు శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రాహ్మణవీధిలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో స్వామివారి ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకీపై అధిష్టింపజేసి వివిధ రకాల సేవలతో 12 సార్లు ఆలయంలో ప్రదక్షిణలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి నామసంకీర్తనతో భక్తులు ఊరేగింపును అనుసరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న అద్దాల మండపంలో స్వామివారికి పవళింపు సేవ జరిగింది. వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకస్వాములు పాణింగిపల్లి శ్రీరామచంద్రమూర్తి నిర్వహించారు.

యువత సాహిత్యంలో రాణించాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వచన సాహిత్యంలో యువత రాణించాలని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం(నెల్లూరు) సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ సూచించారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేబీఎన్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో వచన కవిత్వంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంపత్ కుమార్ మాట్లాడుతూ సమాజంలోని సంఘటనలు, ఇతివృత్తాలు కవిత్వానికి కావాల్సిన స్ఫూర్తిని అందిస్తాయన్నారు. యువతలో సృజనాత్మక శక్తి అధికంగా ఉంటుందని, దీనికి సాహిత్యాన్ని జత చేస్తే ఉత్తమ కవిత్వం వెలువడుతుందని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీ కృష్ణవేణి సభాధ్యక్షత వహించారు. సాహితీవేత్తలు ఆచార్య మేడిపల్లి రవికుమార్, డాక్టర్ సుంకర గోపాల్ వచన కవిత్వ నిర్మాణం, శైలి, వస్తువు తదితర అంశాలను వివరించారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ శ్యామ్‌కుమార్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు లక్ష్యసాధనకు పాటుపడాలని జేఎన్‌టీయూ (కాకినాడ) స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జీ శ్యామ్‌కుమార్ అన్నారు. నగరంలోని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ వార్షిక క్రీడా దినోత్సవం ఆ కళాశాల ఆవరణలో శుక్రవారం సందడిగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. తొలుత కళాశాల కబడ్డీ ఫైనల్ పోటీలను అతిథుల చేతుల మీదుగా ప్రారంభించారు. అలాగే అంతర్ కళాశాలల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. అనంతరం డాక్టర్ శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో విజయాలను సాధించేందుకు నిరంతర శ్రమ అవసరమన్నారు. పొట్టిశ్రీరాములు కళాశాల విద్యార్థులు వివిధ క్రీడాంశాల్లో విశ్వవిద్యాలయానికి సైతం పేరుప్రఖ్యాతలు తీసుకొచ్చారని కొనియాడారు. బహుమతి ప్రదానం చేసిన హాస్యనటుడు ఆకెళ్ల గోపాలకృష్ణ మాట్లాడుతూ మానవ జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమన్నారు. విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లోనూ రాణించాలని, అప్పుడే ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవచ్చని వివరించారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్ సుధీర్ మాట్లాడుతూ కళాశాల నిర్వహించే కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కమిటీ ప్రముఖులు పొట్టి సురేంద్రకుమార్, చిట్టూరి ఆనంద రామసుధాకర్, గ్రంధి పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ పతంజలిశాస్త్రి, డాక్టర్ కే సురేష్, ఫిజికల్ డైరెక్టర్ ఎం విక్టర్, అధ్యాపకులు డాక్టర్ ఎస్ మణికంఠ, డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11కేవీ హౌసింగ్‌బోర్డ్ కాలనీ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ (విజయవాడ టౌన్) పీ రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌బీకాలనీలోని హెచ్‌ఐజీలు, ఎల్‌ఐసీ ఆఫీస్, రిలయన్స్ ఫ్రెష్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

గోల్డ్ ఫైనాన్స్ కంపెనీల్లో తనిఖీలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గోల్డ్ ఫైనాన్స్ కంపెనీల్లో మచిలీపట్నం పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. చిట్టినగర్ మసీదు ఎదురుగా ఉన్న గోల్డ్ కంపెనీతోపాటు బంగారయ్య కొట్టు సమీపంలోని మరో గోల్డ్ ఫైనాన్స్ కంపెనీలో కూడా తనిఖీలు జరిగాయి. కృష్ణాజిల్లా మచిలీపట్నంకు చెందిన ఓ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ బ్యాంక్‌లో ఖాతా దారులు తాకట్టు పెట్టిన బంగారాన్ని మాయం చేశాడు. సుమారు రూ. [illegible] 1.60 కోట్ల విలువైన బంగారాన్ని మాయం చేసిన ఈ ఘటనలో అసిస్టెంట్ మేనేజర్‌కు బ్యాంక్ మేనేజర్ సహకారం అందించినట్లు తెలుస్తోంది. బ్యాంక్ ఇంటర్నల్ ఆడిట్‌లో ఈ వ్యవహారం బయటకు రాగా ఇద్దరిపై బ్యాంక్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ బంగారాన్ని విజయవాడ చిట్టినగర్‌లోని పలు గోల్డ్ ఫైనాన్స్ కంపెనీల్లో తాకట్టు పెట్టినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో విజయవాడ కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గోల్డ్ ఫైనాన్స్ కంపెనీల రికార్డులను పోలీసులు తనిఖీ చేశారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ తనిఖీలు కొనసాగాయి. ఫైనాన్స్ కంపెనీలో ఉన్న రికార్డుల మేరకు బంగారాన్ని ఎవరెవరి పేరిట తాకట్టు పెట్టారు.. ఈ కేసులో ఇంకా ఎవరైనా నిందితులు ఉన్నారా అనే కోణంలో విచారణ జరుగుతోంది. మరోవైపు ఈ ఘటనలో స్థానికంగా ఎవరైనా సహకరించారా అని కొత్తపేట పోలీసులు విచారణ చేపట్టారు.

19న కేబీఎన్‌లో 'మస్త్ - 2025'



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్యదర్శి శ్రీనివాసు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు తమ కళాశాల పీజీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన 'మస్త్' (మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ స్కిల్స్ టెస్ట్) రాష్ట్రస్థాయి సాంస్కృతిక మహోత్సవం నిర్వహించనున్నట్లు కేబీఎన్ కళాశాల కార్యదర్శి టీ శ్రీనివాసు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం కేబీఎన్ కళాశాల కమిటీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసు మా ట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని డిగ్రీ, పీజీ కళాశాలల వి ద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. బిజినెస్ క్విజ్, మార్కెట్ మేకర్స్, యంగ్ మేనేజర్, స్టాక్ గేమ్, మూవీ క్విజ్, నృత్యం, మిస్టర్ అండ్ మిసెస్ మస్త్, ట్రెజర్ హంట్, ఐపీఎల్ ఆక్షన్, స్పాట్ ఫొటోగ్రఫీ, రీల్ ఇట్ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇతర వివరాలకు 98857 66676 నంబరులో సంప్రదించవచ్చని సూచించారు. కమిటీసభ్యులు మాజేటి సురేంద్రనాథ్, హిందూ హైస్కూల్ కమిటీ ఏఓ డాక్టర్ వీ నారాయణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జీ కృష్ణవేణి, పీజీ కోర్సెస్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం వేంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ పాల్గొన్నారు.

2017 నుంచి పెన్షన్ సవరణ చేయాలి

ఏఐబీడీపీఏ ఆలిండియా జనరల్ సెక్రటరీ కె.జి.జయరాజ్



మాట్లాడుతున్న ఏఐబీడీపీఏ ఆలిండియా జనరల్ సెక్రటరీ కె.జి.జయరాజ్

కృష్ణలంక(విజయవాడతూర్పు): బీఎస్ఎన్ఎల్ సంస్థలో పని చేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు 2017 జనవరి 1వ తేదీ నుంచి పెన్షన్ సవరణ చేయాలని, మెడికల్ బిల్స్ చెల్లించాలని ఆలిండియా బీఎస్ఎన్ఎల్ డీఓటీ పెన్షనర్స్ అసోసియేషన్ (ఏఐబీడీపీఏ) ఆలిండియా జనరల్ సెక్రటరీ కె.జి.జయరాజ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఆలిండియా బీఎస్ఎన్ఎల్ డీఓటీ పెన్షనర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ 3వ సర్కిల్ కాన్ఫరెన్స్ - 2025 సర్కిల్ అధ్యక్షుడు ఎం.యాకోబు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జయరాజ్ మాట్లాడుతూ 2017 నుంచి పెన్షన్ సవరణ జరగకపోవడానికి కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. దానికి తోడు కోర్టులో కేసులను సాకుగా చూపించి పెన్షన్ సవరణ నిరాకరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ రివిజన్ జరగకపోవడంతో పెన్షనర్స్‌పై ఆధారపడిన లక్షలాది మంది బాధపడుతున్నారని చెప్పారు. ఏఐబీడీపీఏ ఆలిండియా వైస్ ప్రెసిడెంట్ పి.అశోక్‌బాబు, బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆలిండియా వైస్ ప్రెసిడెంట్ రమాదేవి, యూనియన్ సర్కిల్ సెక్రటరీ కృష్ణబాలాజీ మాట్లాడుతూ పెన్షనర్స్ సమస్యలను వివరించారు. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, ఏఐబీడీపీఏ సర్కిల్ సెక్రటరీ కె.ఎస్.సి.బోస్, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడారు. అనంతరం రెండు సంవత్సరాల కాలానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సర్కిల్ ప్రెసిడెంట్‌గా ఎం.యాకోబు, సర్కిల్ సెక్రటరీగా నరేంద్ర రామారావు, సర్కిల్ ట్రెజరర్‌గా ఎం.ఎస్.ఎస్.రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్‌ను విజయవంతం చేయాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వచ్ఛాంధ్ర, హరితాంధ్ర, ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా అమలుచేస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని.. ప్రతి నెలా మూడో శనివారాన్ని స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌గా గుర్తించినందున ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఈ నెల 15వ తేదీ మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై కలెక్టర్ లక్ష్మీశ జిల్లాస్థాయి అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు తదితరులతో కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి నెలా ఒక ఇతివృత్తంతో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందని.. ఈ నెల కూడా సోర్స్ - రిసోర్స్ ఇతివృత్తంతో కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నియమ నిబంధనలు అనుసరించి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞను చేయించాలని సూచించారు. కార్యక్రమం వివరాలను స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యాలయాల్లోనూ స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. టెలీకాన్ఫరెన్స్‌లో విజయవాడ నగరపాలకసంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం, డీపీఓ పి.లావణ్య కుమారి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పార్కుల్లో సౌకర్యాలు పెంచాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



వెటర్నరీ కాలనీలోని పార్కులో సమస్యలు తెలుసుకుంటున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): పార్కుల్లో వ్యాయామం చేసేవారికి సౌకర్యాలను మరింత మెరుగుపరచాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. టిక్కిల్ రోడ్డు, మదర్ థెరిస్సా జంక్షన్, వెటర్నరీ కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. కాలనీల్లోని పార్కులను సందర్శించి అక్కడికి వచ్చిన వారితో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్క్‌లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పెంచేందుకు మరమ్మతులు పూర్తి చేసి ప్రజలకు వెంటనే అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ కమ్యూనిటీ హాల్లో ఉన్న ప్లే గ్రౌండ్ పరిశీలించి, ప్రజలు ఆడుకునేందుకు వీలుగా మరమ్మతులు చేయాలని సూచించారు. అనంతరం ఆయన టిక్కిల్ రోడ్, మదర్ థెరిస్సా జంక్షన్ ప్రాంతాలను పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ తీరు తనిఖీ చేశారు. డ్రెయిన్‌లలో పూడికలను ఎప్పటికప్పుడు తీయాలని ఇంజినీరింగ్, ప్రజారోగ్యం విభాగం అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న నిర్మాణ వ్యర్థాలను చూసి వాటిని వెంటనే తొలగించాలని, సంబంధిత భవన నిర్మాణ యజమానులకు నోటీసులు అందించాలని చెప్పారు. రోడ్డు మీద ఉన్న పాత వాహనాలను పోలీసు వారి సమన్వయంతో ట్రాఫిక్ అంతరాయం లేకుండా తరలించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎస్ఈ (ప్రాజెక్ట్) పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఉండే వస్తువులు, పరికరాలను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్

పటమట(విజయవాడతూర్పు): సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వస్తువులు, దాని ప్రత్యామ్నాయంగా పర్యావరణ హితమైన వస్తువులు చూపించే ప్రత్యేక స్టాల్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ హితమైన వస్తువులే వాడాలని, ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వస్తువుల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని చెప్పారు. ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ప్రతి సర్కిల్లో స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఒకసారి వాడి పడేసే ప్రతి ప్లాస్టిక్ వస్తువుకు ప్రత్యామ్నాయలు చూపిస్తూ సిబ్బంది, ప్రజలకు అవగాహన కల్పించే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్క్రూ గేజ్‌తో ప్లాస్టిక్ కవర్లను కొలిచి చూశారు. 120 మైక్రాన్ల కంటే తక్కువగా ఉన్న సింగిల్ యూస్ ప్లాస్టిక్ వస్తువులు భూమిలో కలవకుండా పర్యావరణానికి హాని కల్పించేవని, ప్రజలకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ పెట్టు.. చాక్లెట్ పట్టు



వాహనదారుడికి అవగాహన కల్పిస్తున్న డీటీసీ మోహన్, పోలీస్ అధికారులు

విజయవాడస్పోర్ట్స్: హెల్మెట్ ధరించడం భారంగా కాకుండా బాధ్యతగా భావించాలని జిల్లా రవాణా కమిషనర్ ఎ.మోహన్ వాహనచోదకులు సూచించారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఎంజీ రోడ్డులో హెల్మెట్ పెట్టు.. చాక్లెట్ పట్టు అనే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. హెల్మెట్ ధరించిన వాహన చోదకులకు చాక్లెట్‌లు పంచారు. ధరించని వారికి హెల్మెట్ ఆవశ్యతలను రవాణా అధికారులు వివరించారు. ఈ సందర్భంగా డీటీసీ మోహన్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, తమ విలువైన ప్రాణాలు కాపాడుకోవాలన్నారు. డ్రైవింగ్ సమయంలో హెల్మెట్ ధరించకపోవడంతో రోడ్డు ప్రమాదాలకు గురైన వారిలో సంవత్సరానికి వందల సంఖ్యలో మృత్యువాత పడుతున్నారని గుర్తు చేశారు. హెల్మెట్లు అసౌకర్యాన్ని కలిగిస్తాయని, హెల్మెట్ పెట్టుకోవడం వల్ల జుట్టు ఊడిపోతుందనే అసంబద్ధ వాదనలను నమ్మొద్దని సూచించారు. మీరు ధరించే హెల్మెట్ మీ కుటుంబ సభ్యులను రక్షిస్తుందనే నిజాలను దృష్టిలో పెట్టుకోవాలన్నారు. హెల్మెట్ ధరించని వాహనదారులకు రోడ్లపైకి ప్రవేశం లేదని, అలాంటి వారిపై కేసులు నమోదు చేసి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్టీవోలు ఆర్.ప్రవీణ్, కె.వెంకటేశ్వరరావు, ఎంవీఐలు వి.పద్మాకర్, ఎ.ఉదయశివ ప్రసాద్, డి.వి.రమణ, బి.శ్రావణి, గీతాంజలి, ప్రియదర్శిని, కె.వి.రవిగోపాల్, బి.ఉమామహేశ్వరరావు, లాజర్‌బాబు, రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షులు ఎం.రాజుబాబు, కార్యాలయ పరిపాలన అధికారులు సత్యనారాయణ, గవర్నమెంట్ నర్సింగ్ కాలేజ్ ఎన్.ఎస్.ఎస్.కోఆర్డినేటర్ శ్రీదేవి, పెద్ద సంఖ్యలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

• అరుణవర్ణం





విజయవాడ నగరంలోని పున్నమి ఘాట్ సమీపంలో శుక్రవారం సాయంసంధ్య వేళ అరుణవర్ణం కనువిందు చేసింది. కృష్ణానదిలో చేపల వేటకు వల వేస్తున్న మత్స్యకారులు, ఆకాశంలో సూర్యుడు అరుణవర్ణంలో చూపరులను ఆకట్టుకున్నారు. ఈ దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ